





# Voice of Jagadguru

advaitam paramanandam

an e-magazine on advaita

## Sri Vajrotsava Bharathi Special Edition 2



# Vajrotsava Bharathi

## SPECIAL SOUVENIR 2

**Our humble pranams at the lotus feet of Jagadguru Śankaracārya Mahāsannidhānam His Holiness Śri Śri Śri Bhārati Tīrtha Mahāswāmi-ji. We submit our efforts at the lotus feet of Jagadguru Śankaracārya His Holiness Mahāsannidhānam Śrī Śrī Srī Bhāratī Tīrtha Mahāswāmiji and Jagadguru Śankaracārya His Holiness Sannidhānam Śrī Śrī Śrī Vidhuśekhara Bhāratī Mahāswāmiji.**

> We submit our efforts at the Lotus feet of Jagadguru Śankarācārya His Holiness Mahāsannidhānam Śrī Śrī Srī Bhāratī Tīrtha Mahāswāmiji and Jagadguru Śankarācārya His Holiness Sannidhānam Śrī Śrī Śrī Vidhuśekhara Bhāratī Mahāswāmiji

## Jagadguru Vani అనుగ్రహ భాషణం  సహాయానికి సరైన మార్గం



ఇతరులకు సహాయపడే అవకాశం, మానవ జీవితంలో ప్రతి ఒక్కరికీ కొన్ని సార్లు రావచ్చును. అతని మనస్సు కూడా అలా ఉపకారం చేయటానికి మొగ్గు చూపవచ్చును. అలాంటి సమయాల్లో అతను వివేకముతో వ్యవహరించాలి. సహాయం చేయడానికి ముందు, ఆ సహాయం ఆ అభ్యర్థన చేసిన వ్యక్తికి ఉపయోగకరంగా ఉంటుందా లేదా అని జాగ్రత్తగా పరిశీలించాలి. ఒకవేళ ఆ అభ్యర్థన దారుడు మన సహాయం వలన, అతని సమస్య నుండి బయటపడతాడు అని అనుకుంటే, అప్పుడు మనం అతనికి తప్పక సహాయం చేయవచ్చును.

ఉదాహరణకు, మనము ఒక విద్యావంతుడైన విద్యార్థికి అతని స్కూల్ ఫీజు కట్టి సహాయపడవచ్చును. ఒక మంచి వ్యక్తికి అతని కుమార్తె వివాహ ఖర్చుల అవసరార్థం ధనం సహాయం చేయవచ్చును. ఇవి చాలా ప్రశంసనీయమైనవి, కాబట్టి వీరికి సహాయం చేయవచ్చును. వారు సహాయకులకు కూడా ప్రయోజనాలను తెస్తారు.


**ఏకమపి సతాం సుకృతం వికసతి తైలం యథా జలే న్యస్తం |**
**అసతాముపకారశతం సంకుచతి సుశీతలే ఘృతవత్ ||**

పెద్దలు ఓ సూక్తి అన్నారు...."ఓ మంచి వ్యక్తికి అందించిన సహాయం నీటిలో కలిపిన నూనె లాగా విస్తరిస్తుంది. అదే ఒక దుర్మార్గుడికి వందసార్లు చేసిన సహాయం కూడా శీతాకాలం లోని నెయ్యి లాగా ఘనీభవించి కుంచించుకుపోతుంది, విస్తరించదు". దీన్ని బాగా అర్థం చేసుకోవడం ద్వారా, అర్హత ఉన్నవారికి మాత్రమే జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత సహాయం చేయాలి మనం.

**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి**
**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం, శృంగేరి.**

Our mail ID : info@voiceofjagadguru.com

## Jagadguru Vani అనుగ్రహ భాషణం నిజమైన భక్తిని పెంపొందించుకోండి



భక్తి ప్రతి ఒక్కరికీ అవసరమే, కానీ ఆ భక్తి కృత్రిమంగా ఉండకూడదు. కొంతమందికి భక్తి ఉంటుంది, కానీ వారికి సమస్యలు ఎదురైనప్పుడు, ఆ భక్తి స్థిరంగా వుండదు. దానిని బూటకమైన భక్తి అంటారు. వీరికి భగవంతుని అనుగ్రహం లభించదు. పార్వతి శివుడిని పొందడానికి తపస్సు చేసింది.

అప్పుడు ఒక బ్రహ్మచారి ఆమె వద్దకు వచ్చి, తపస్సు ఎందుకు చేస్తున్నావని అడిగాడు. "శివుణ్ణి చేరుకోవడానికి" అని అన్నది ఆమె. అప్పుడు ఆయన "శివునిలో ఏముంది? అతనికి సంపద లేదు, ఎప్పుడూ ఒక పాత ముసలి ఎద్దుపై తిరుగుతూ ఉంటాడు. శ్మశానవాటికలోని చితాభస్మాన్ని ఒంటికి పూసుకుంటాడు. బట్టలు కూడా లేవు ధరించడానికి. తన మూడు కళ్ళతో చూడటానికి వికృతంగా ఉంటాడు. ఆయన పుట్టుక గురించి ఎవరికీ తెలియదు. నీలాంటి అందమైన అమ్మాయి అతన్ని కోరుకోవడం చాలా విడ్డూరంగా వున్నది ...అని అంటాడు.

దానికి పార్వతి ఇలా జవాబిచ్చింది, నీకు శివుని గురించి తెలియదు. ఆయనకు తెలియకుండా ఇలా మాట్లాడటం సరికాదు. ఆయనకు సంపద లేదని మీరు చెప్పారు. కానీ సంపదను కోరుకునే వారందరూ ఆయన అనుగ్రహాన్ని కోరుకుంటారు. ఆయన ఒక ముసలి ఎద్దుపై తిరుగుతాడని మీరు చెప్పారు, కాని తెల్ల ఏనుగును ఎక్కి అంబారీ పై విహరించే దేవేంద్రుడు కూడా ఆయనను ఆరాధిస్తాడు. ఆయన పుట్టుక తెలియదని మీరు చెప్పారు; అది చాలా నిజం. ఆయన సనాతనుడు. ఆ పరమ శివుడే అందరినీ సృష్టించాడు. ఎందుకంటే, ఆయనకు సృష్టికర్త లేడు.

ఇక మాట్లాడాల్సిన అవసరం లేదు. మహాత్ముని నిందించేవాడికి వచ్చే పాపం, ఆ తిట్లు వినేవాడికి కూడా వస్తుంది.

न केवलं यो महतोऽपभाषते शृणोति तस्मादपि यः स पापभाक्

ఇక మీ మాట వినడానికి నేను సిద్ధంగా లేను...అని అన్నది పార్వతి.

పార్వతి యొక్క గాఢమైన భక్తికి సంతోషించిన బ్రహ్మచారి అదృశ్యమై, అతని స్థానంలో శివుడు వెంటనే ప్రత్యక్షమయ్యాడు, ఎందుకంటే ఆ బ్రహ్మచారి మరెవరో కాదు, పార్వతి భక్తిని పరీక్షించడానికి వచ్చిన మహా శివుడు.

భగవంతుని పట్ల అచంచలమైన భక్తిని అందరూ అలవర్చుకొని, ఆయన అనుగ్రహాన్ని పొందాలి.

**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్య శ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి**
**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం, శృంగేరి.**

Our mail ID : info@voiceofjagadguru.com

## Jagadguru Vani అనుగ్రహ భాషణం సరైన మార్గంలో ఉండండి

భగవాన్ శ్రీకృష్ణ పరమాత్మ గీతలో ఏమన్నారంటే :

**యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః |**

**స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ||**



అంటే, ఇతరులకు సరైన మార్గాన్ని చూపించగల సామర్థ్యం ఉన్నవారిని ప్రజలు అనుసరిస్తారు. శ్రేష్ఠులు ఏది ఆచరిస్తారో, దానినే సామాన్య జనులు కూడా ఆచరిస్తారు. అందువల్ల, ఉన్నత స్థానాల్లో ఉన్నవారు ఎల్లప్పుడూ ధర్మ మార్గంలోనే నడవాలి. వారు కొంచెం తడబడితే, అది ఇతరులను కూడా బాగా ప్రభావితం చేస్తుంది.

కాళిదాసు మహాకవి విరచిత రఘువంశ మహా కావ్యంలో, దిలీప చక్రవర్తి 99 అశ్వమేధ యాగాలను పూర్తి చేశాడు. వందో యజ్ఞం ప్రారంభమవుతున్నది. అది పూర్తయిన తర్వాత, అతను ఇంద్ర పదవిని పొందగలడు. కానీ దేవేంద్రునికి అది ఇష్టం లేదు, అందుకని యాగాశ్వమును బంధించినాడు. ఈ సమయంలో, దిలీప చక్రవర్తి కుమారుడైన యువరాజు రఘు మహారాజు, దేవేంద్రునితో ఇలా అంటాడు...

पथः श्रुतेर्दर्शयितार ईश्वरा मलीमसामाददते न पद्धतिम् ||

"శ్రేష్ఠులు ఇతరులకు సరైన మార్గాన్ని చూపించవలసి ఉంటుంది, తమంతటతాము తప్పుడు పనులకు పాల్పడరు. వారు అలా చేయగలరా?"

కాబట్టి, ఎవరైనా ఏ స్థానంలో ఉన్నా, ధార్మిక మార్గాన్ని అనుసరించాలి. మరోవైపు, దానిని పాటించక, తనను ఎవరూ ప్రశ్నించరని భావించి తప్పుడు పనులు చేసిన వారిని ఎవ్వరూ క్షమించరు, గౌరవించరు. ప్రతి ఒక్కరూ ఈ సత్యాన్ని గ్రహించి, హోదాతో, స్థాయి తో సంబంధం లేకుండా సన్మార్గంలో నడుస్తూ శ్రేయస్సును పొందండి. **జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి**
**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం, శృంగేరి.**

Our mail ID : info@voiceofjagadguru.com

## Jagadguru Vani అనుగ్రహ భాషణం నిజమైన బంధువు



మన జీవితంలోని కొంత మందిని అనగా మన స్నేహితులను, బంధువులను, మనకు సంబంధించినవారని, ఆత్మీయులు అని మనం అనుకుంటాం. ఈ ఆప్తులు, మన కష్ట కాలంలో మనకు సహాయము కూడా చేస్తారు. మనం కూడా ఒక్కోసారి మన దుఃఖానికి కారణమైన వారిని నిందిస్తాము అలాగే సంతోషానికి కారణమైన వారిని ప్రశంసిస్తాము. కానీ మన శాస్త్రాలు ఏమని చెబుతున్నాయి అంటే,

ఆత్మైవ హయాత్మనో బంధుః |ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మానమవసాదయేత్ |
ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవరిపురాత్మనః ||

"ఒక వ్యక్తి యొక్క నిజమైన స్నేహితుడు ఎవడంటే, తాను తప్ప మరెవరో కాదు. మీ సర్వావస్థలయందు, మీతో పాటు అండగా నిలబడే వ్యక్తిని "బంధు" అని పిలుస్తారు. ఆ బంధువు మరెవరో కాదు మీరు చేసిన కర్మయే". ఇది మన జీవిత కాలమంతా మనతో బాటు వుండటమే కాకుండా, మన మరణం తర్వాత కూడా, రాబోయే జన్మలలో కూడా మనతో బాటు ఉంటుంది.

మన కర్మలే మన సుఖ-దుఃఖాలకు కారణం. మనం ధర్మాన్ని ఆచరిస్తే, సుఖాన్నీ పొందుతాము మరియు ఈ జన్మలోనే కాకుండా, రాబోయే జన్మలలో కూడా ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతాము. అదే సమయంలో మనం అధర్మం చేస్తే, దుఃఖాన్నీ పొందుతాము. సత్యం ఏమిటంటే, మన సుఖ-దుఃఖాలకు ఇతరులను నిందించడం తెలివైన పని కాదు. ఒక వ్యక్తి తన జీవితంలో జరిగే అన్ని సంఘటనలకు తానే బాధ్యుడు, ఇతరులు కాదు అని చాలా స్పష్టంగా చెప్పబడి వున్నది. అతనికి అతనే స్నేహితుడు మరియు శత్రువు.

రావణుడు మరియు దుర్యోధనుని జీవితాలు మనకు పాఠాలను నేర్పిస్తాయి, మనం అధర్మం చేస్తే, మనం ఎంతో బాధపడతాము, చివరకు మన పరివారముతో సహా సర్వ నాశనం అవుతాము అని. రామాయణం మరియు మహాభారతం నుండి మనకు తెలియ వచ్చింది ఏమిటంటే, అధర్మం చేసే వారి జీవితం ప్రారంభంలో సిరి సంపదలతో, పేరు ప్రఖ్యాతలతో మరియు కీర్తితో వర్ధిల్లుతున్నట్లుగా అనిపిస్తుంది కానీ చివరికి అన్నీ నాశనమవుతాయి. రామాయణం నుండి మనం నేర్చుకున్న పాఠం ఏమిటంటే "రావణుడి లాగా జీవించడం కాదు, రాముడిలా బ్రతుకు" అని.

అశోక వనంలో "సీతా మాతను" దర్శనం చేసుకున్న తరువాత, స్వామి హనుమాన్ రావణుడిని తన దర్బార్‌లో కలిశాడు. ఆ సమయంలో హనుమంతుడికి రావణాసురుడి యొక్క వ్యక్తిత్వం గురించి ఓ ఆలోచన మెదిలింది, నిస్సందేహముగా ఇతను త్రిలోకాలను పరిపాలించే శక్తిని మరియు సామర్థ్యాన్ని కలిగి యున్నాడు, కానీ అతను తన జీవితంలో చేసిన పెద్ద పాపం (అధర్మ) కారణంగా అతను ఆ యోగ్యతకు సరిపోడు. త్వరలోనే అతడికి చాలా కఠినమైన శిక్ష విధించబడుతుంది. అతను చేసిన అధర్మం ఏమిటంటే, "సీతమ్మను" ను వక్ర దృష్టితో చూడటం. మహిళలందరినీ మన తల్లులాగా చూడమని మన శాస్త్రాలు మనకు నిర్దేశిస్తున్నాయి. మన జీవితంలో కామానికి చోటు కల్పిస్తే, మన ఆధార్మిక పనుల వల్ల మనం చాలా నొప్పి, బాధలను, కష్టాలను పడాల్సి వస్తుంది.


అందుకే మనిషికి నిజమైన బంధువు ఎవరంటే, అతనికి అతనే. సంతోషకరమైన మరియు ప్రశాంతమైన జీవితం కోసం మనం ధర్మాన్ని పాటించాలి మరియు అధర్మానికి దూరంగా ఉండాలి.

**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి**
**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం, శృంగేరి.**

Our mail ID : info@voiceofjagadguru.com

## Jagadguru Vani - అనుగ్రహ భాషణం

### భగవంతుని చర్యలన్నీ సమర్థనీయమే (All acts of God are fully justified)




మహాభారత యుద్ధ కాలంలో శ్రీకృష్ణుని ప్రవర్తన అందరికీ ఆశ్చర్యాన్ని కలుగజేసింది "ఆయనకి కూడా రాగ ద్వేషాలు ఉన్నాయా" అని.

ఉదాహరణకు, సైంధవ వధ సంఘటనలో, శ్రీ కృష్ణుడు తన సుదర్శన చక్రంతో సూర్య మండలాన్ని అడ్డగించి, కౌరవులకు సూర్యాస్తమయం అనే భ్రమను కల్పించి అర్జునుడి చేత సైంధవుని యొక్క తలను శిరచ్ఛేధనం గావించినాడు. కొంతమంది దీనిని పక్షపాత చర్యగా చూడవచ్చును. వాస్తవానికి, మహాపురుషులు ప్రసాదించిన శాపానుగ్రహములు నిరర్థకం కాకుండా, వ్యక్తుల యొక్క విధి లిఖితాన్ని అమలుపరచటమే భగవంతుని యొక్క కర్తవ్యం. సూర్యాస్తమయం నాటికి సైంధవుడిని చంపకపోతే తనకు తాను ప్రాణ త్యాగము చేసుకుంటానని అర్జునుడు ప్రతిజ్ఞ చేశాడు. సైంధవుడి శిరస్సు ఎవరి చేతుల పై నుండి భూమిపై పడుతుందో వారి శిరస్సు నూరు చెక్కలు అవుతుంది అని సైంధవుడి తండ్రి శపించియున్నాడు.

धरण्यां मम पुत्रस्य पातयिष्यति यश्शिरः । तस्यापि शतधा मूर्धा फलिष्यति न संशयः॥

తొలుత, అర్జునుడు జన్మించినప్పుడు, అతను తన సోదరులతో కలిసి మూడు అశ్వమేధ యాగములు చేస్తాడని అశరీరవాణి పలికింది. కాబట్టి ఇది కూడా సఫలము కావలసియున్నది.

जातमात्रे कुमारे तु वागुवाचाशरीरिणी । भ्रातृभिः सहितो वीरस्त्रीन्मेधानाहरिष्यति ॥

ఇప్పుడు, సంఘటనల యొక్క మలుపులను చూద్దాం. సూర్యాస్తమయానికి ముందు సైంధవుడిని చంపకపోతే, అర్జునుడు తనను తాను చంపుకుంటాడు. అర్జునుడి చేతిలో సైంధవుడు మరణిస్తే, అర్జునుడి తల వేయి ముక్కలైపోతుంది. ఈ పరిస్థితులలో అర్జునుడు మరణిస్తే, అశరీరవాణి యొక్క వాక్కు అసత్యమౌతుంది. ఒకవేళ సైంధవుడిని తన చేతులతో చంపిన తర్వాత కూడా అర్జునుడు ఇంకా జీవించి ఉంటే, సైంధవుడి తండ్రి ఇచ్చిన శాపం నిరర్థకం అవుతుంది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని, శ్రీ కృష్ణుడు సైంధవుని తల తన స్వంత తండ్రి చేతుల మీదుగా క్రిందకు నేల మీద పడిపోయేలా చేశాడు.

ఇక్కడ రాగ ద్వేషములకు చోటు లేదు. భగవంతుడు మాత్రమే ఇలాంటి సమన్వయం తీసుకొనిరాగలడు. అందువల్ల, భగవంతుని యొక్క ప్రతి చర్య పూర్తిగా సరి అయినది మరియు సమర్థనీయమైనది అని మనం అర్థం చేసుకోవాలి.

**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి**
**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం, శృంగేరి.**

Our mail ID : info@voiceofjagadguru.com

## Jagadguru Vani - అనుగ్రహ భాషణం

### ఇతరులను అవమానించడం మానుకోండి (Avoid Insulting Others)



మనిషి ఎల్లప్పుడూ సంతోషకరమైన జీవితాన్ని గడపాలి మరియు అందరి పట్ల దయగా ఉండాలి. కోరికకు, ద్వేషానికి చోటు ఇవ్వడం అన్ని రకాల సమస్యలకు దారితీస్తుంది. ఇతిహాసాలు, పురాణాల నుంచి, దైనందిన జీవితం నుంచి కూడా ఈ విషయాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. అయితే, కొంతమందికి ఒక వింత లక్షణం ఉంటుంది; అది ఇతరులను అవమానించే ధోరణి. అలాంటి లక్షణం ఉన్న వ్యక్తి తన బాధను మాత్రమే తెచ్చుకుంటాడు. ఇతరులను ఎవరూ కించపరచకూడదు. ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవం ఉంటుందని గ్రహించి తదనుగుణంగా నడుచుకోవాలి. అగౌరవంగా వ్యవహరించే వ్యక్తి బలవంతుడైతే ప్రతీకారం తీర్చుకుంటాడు. దీనికి అంతం లేదు. అవమానం, ప్రతీకార చక్రం ఎప్పటికీ కొనసాగుతుంది.

అయితే, అవమానించిన వ్యక్తి వివేకవంతుడు అయితే, అతను దానిని విస్మరిస్తాడు. అతను నిశ్శబ్దంగా మరియు తనలో బాగా సంఘటితమై ఉంటాడు. తన మనస్సుపై నియంత్రణ ఉన్నందున అతను వేదనకు గురికాడు. అతని దైనందిన జీవితం కూడా ఎలాంటి ఆందోళన లేకుండా సాఫీగా సాగిపోతుంది.

తరచూ ఇతరులను కించపరిచే చర్యలకు పాల్పడే వ్యక్తిని వదిలిపెట్టరు. అంతిమంగా పర్యవసానాలను ఆయనే భరించాల్సి ఉంటుంది. అందుకే ఆచరణాత్మక జీవితంలో ఏది మంచిదో గ్రహించి దానికి అనుగుణంగా జీవితాన్ని గడపాలని మన పూర్వీకులు సలహా ఇచ్చారు. మనమందరం దీన్ని బాగా అర్థం చేసుకుందాం, ఇతరులను అవమానించకుండా, సహనాన్ని పెంపొందించుకుందాం మరియు పవిత్రమైన జీవితాన్ని గడుపుదాం.

**సుఖం హ్యవమతః శేతే సుఖం చ ప్రతిబుధ్యతే |**
**సుఖే చరతి లోకేఽస్మిన్నవమంతా వినశ్యతి ||**

**జగద్గురు శంకరాచార్య పరమ పూజ్యశ్రీ మహాసన్నిధానం శ్రీ శ్రీ భారతీతీర్థ మహాస్వామి**
**శ్రీ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం, దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదాపీఠం, శృంగేరి.**

Our mail ID : info@voiceofjagadguru.com

Our Website link : https://voiceofjagadguru.com/voj/

Telegram Channel : https://t.me/voiceofjagadguru

Instagram Channel :

https://www.instagram.com/stories/voice_of_jagadguru_voj/3601249542534134684?igsh=MW90YW13N2c5b2hqaA==

WhatsApp Community Channel: https://chat.whatsapp.com/Ly4wlaTu8Kc3sjjEYU8KGu

YouTube Channel : https://youtube.com/@jagad-guru-channel?si=brkLFqiz8sZJ6UIl


| Editorial Board | | |
|---|---|---|
| Sri P A Murali | Hon' Advisor | Administrator & CEO, Sri Sringeri Mutt & It's Properties, Sringeri |
| Sri S N Krishnamurthy | Hon' Editor | Sri Sringeri Mutt, Sringeri |
| Sri Tangirala Shiva Kumara Sharma | Hon' Editor | Sri Sringeri Mutt, Sringeri |
| B. Vijaya Anand<br>—-------------------------------------<br>B Srimathi Veeramani | Web Director<br>—-----------------<br>Web Asst.Director & Chief Editor | Coimbatore<br>—------------------------------------------------------------------<br>-------------Tirunelveli |
| K M Kasiviswanathan | Hon' Editor | Tirunelveli |
| Sri Bhaskarananda Natha | Writer/Translator | Nellore |


Our mail ID : info@voiceofjagadguru.com